# మూడు జిల్లాల్లో సామాజిక పరీక్షలు

ఈనాడు- హైదరాబాద్, ఈనాడు డిజిటల్, న్యూస్‌టుడే బృందం: ఇప్పటి వరకూ జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలున్న, పాజిటివ్ వచ్చిన వారి కుటుంబసభ్యులు, సన్నిహితుల్లో మాత్రమే కరోనా వైరస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. తాజాగా వీరితో సంబంధం లేకుండా ఎటువంటి లక్షణాలు లేని సాధారణ వ్యక్తుల్లోనూ కొవిడ్ 19 నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. చాపకింద నీరులా సమాజంలో ఈ మహమ్మారి వ్యాప్తి చెందిందా? అని గుర్తించడంలో భాగంగా దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల్లోని 60 జిల్లాల్లో సామాజిక సర్వే నిర్వహించాలని భారతీయ వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) నిర్ణయించింది. ఒక్కో జిల్లాలో 10 గ్రామాలను ఎంపిక చేసి, ఒక్కో గ్రామంలో 40 మంది చొప్పున ర్యాండమ్‌గా ఎంపిక చేసి, వారిలో రక్తనమూనాలు సేకరించాలని తీర్మానించింది. ఇందులో భాగంగా తెలంగాణలో కామారెడ్డి, నల్గొండ, జనగామ జిల్లాలను ఎంపిక చేసింది. రాష్ట్రంలో సర్వే బాధ్యతలను జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్)కు అప్పగించింది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న తొలి విడత సర్వే కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో శుక్రవారం ఎంపిక చేసిన మూడు జిల్లాల్లో ప్రారంభమైంది. జిల్లాకు రెండు వందల మంది చొప్పున 600 మంది నుంచి నమూనాలు సేకరించారు. తెలంగాణలో ఈ సర్వేకు నోడల్ అధికారిగా ఎన్ఐఎన్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎ.లక్ష్మయ్య వ్యవహరిస్తున్నారు. భవిష్యత్తులో దేశంలోని కరోనా వ్యాప్తి ఎక్కువగా ఉన్న 10 పట్టణాల్లోనూ ఈ సర్వే చేయనున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.



నార్కట్‌పల్లిలో నమూనాల సేకరణలో భాగంగా ఓ ఇంటి వద్ద వైద్యబృందం

- తొలిరోజు కామారెడ్డి జిల్లాలో కామారెడ్డి పట్టణంలోని నాలుగో వార్డు, మాచారెడ్డి మండలంలోని భవానీపేటలో, రాజంపేటలోని తలమట్ల, తాడ్వాయిలోని ఎర్రాపహాడ్, ఎల్లారెడ్డి మండలంలోని భిక్నూరు పంచాయతీలో పరీక్షలు చేశారు.
- నల్గొండలోని 4వవార్డు, నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం ఇందుగుల, తాందార్‌పల్లి, నార్కట్‌పల్లి మండలం ఆక్కెనపల్లి, కట్టంగూరు మండల కేంద్రంలో నమూనాలు సేకరించారు.
- జనగామ పట్టణంలోని రెండోవార్డు, జనగామ జిల్లా పరిధిలోని బచ్చన్నపేట మండలం కొడ్వటూరు, నర్మెట్టలోని హన్మంతాపూర్, దేవరుప్పలలోని మాధాపురం, లింగాలఘనపురం మండలం కళ్లెం గ్రామంలో పరీక్షలు చేశారు.

## సర్వే విధానం ఇలా..

- రాష్ట్రంలో మొత్తం 15 బృందాలు రంగంలోకి దిగాయి. ప్రతి జిల్లాకు 5 బృందాలు వెళ్లాయి.
- 18 ఏళ్లు పైబడినవారిలోనే నమూనాలు స్వీకరిస్తారు.
- ఐదు వారాల వ్యవధిలో మరోసారి ఈ జిల్లాల్లోనే ఈ గ్రామాల్లోనే మరోసారి సర్వే చేస్తారు. ఇలా మొత్తం నాలుగు విడతలుగా ఈ సర్వే నిర్వహిస్తారు.

### వైరస్ వ్యాప్తిపై అంచనాకు

ఎటువంటి లక్షణాలు లేని వారిలోనూ కరోనా వైరస్ నిర్ధారణ అవుతోంది. ఈ తరుణంలో కరోనా వ్యాప్తి ఎంత మేరకు జరిగింది? సమాజంలో దాని విస్తరణ ఎలా ఉంది? ఎంతమందిలో వైరస్‌ను తట్టుకునే యాంటీ బాడీస్ వ్యవస్థ అభివృద్ధి చెందింది? తదితర అంశాలపై ఒక ప్రాథమిక అంచనాకు రావడానికి ఈ సామాజిక సర్వే దోహదపడుతుంది. ప్రజల్లో రోగ నిరోధక శక్తి ఎలా ఉందనేది కూడా తెలుస్తుంది. నమూనాలన్నింటినీ సేకరించిన అనంతరం ఫలితాల ఆధారంగా వైరస్ ప్రభావాన్ని క్రోడీకరిస్తారు.

–డాక్టర్ హేమలత,
జాతీయ పోషకాహార సంస్థ సంచాలకులు